ప్రజాశక్తి
సోమవారం 12 ఫిబ్రవరి 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అమర్ గ్రాఫ్ తగ్గుతోందా ?

పార్టీలో డిప్యూటీ రీజనల్ కో - ఆర్డినేటర్‌కు పరిమితం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి
రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పార్టీలోనూ సముచిత స్థానం లభించడం లేదన్న చర్చ సర్వత్రా సాగుతోంది. రోజురోజుకూ పార్టీలో ఆయన గ్రాఫ్ పడిపోతున్నట్లు కనిపిస్తోంది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజకవర్గ టిక్కెట్ ఇవ్వకుండా తప్పించిన వైసిపి అధిష్టానం పార్టీ పదవుల్లోనూ ప్రాధాన్యత లేకుండా చేస్తోంది.

అనకాపల్లి సమన్వయకర్తగా మలసాల భరత్‌కుమార్‌ను నియమించడంతో భావోద్వేగానికి గురై అమర్ కన్నీరు పెట్టినా కనికరించి నట్లులేదు. ఎక్కడ నుంచి అమర్ పోటీచేసినా ఓటమిపాలవుతారని వైసిపి అధిష్ఠానం దగ్గరవున్న నివేదికలతో వచ్చే ఎన్నికల్లో ఎక్కడా టిక్కెట్ ఇవ్వకూడదన్న అభిప్రాయానికి పార్టీ వచ్చినట్లు సమాచారం. ప్రజలతో సరిగా ప్రత్యక్ష సంబంధాలు లేకపోవడం, ఉన్న వాటిని నిలబెట్టుకోలేకపోవడం వంటి కారణాలతో అమర్‌ను ఎన్నికలకు దూరంపెట్టాలని

మంత్రి అమర్‌నాథ్ (ఫైల్‌ఫోటో)

ఆలోచనకు వచ్చినట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. మంత్రి అయ్యాక పార్టీ కార్యకర్తలనే కాదు, కుటుంబ సభ్యుల్ని సైతం కలుపుకొని వెళ్లలేదన్న విమర్శలు ఆయనపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ బాధ్యతలు అప్పగించినా ఎన్నికల సమయంలో తలనొప్పిగా మారుతుందని గ్రహించి, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా అమర్‌ను పార్టీ నియమించినట్లు పలువురు చెబుతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్ల అమర్ ఎంత విధేయత చూపినా ఆయన మాత్రం ఎన్నికల్లో నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కనబడుతోంది. దశల వారీగా ప్రాధాన్యత తగ్గిస్తూ వస్తున్నట్లు అర్థమవుతోంది.

తాజాగా డిప్యూటీ రీజనల్ కో - ఆర్డినేటర్‌గా నియమితులైన అమర్ రీజనల్ కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పనిచేయాల్సి వుంది. ఏ పదవీ ఇవ్వలేదని కలత చెందకుండా, పదవి ఇచ్చినట్లే ఇచ్చి ప్రాధాన్యతలేకుండా చేసినట్లు తెలుస్తోంది. యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో ఒక చోట నుంచి పోటీ చేయాలన్న ఆలోచన అమర్‌కు వున్నా జగన్మోహన్‌రెడ్డి టిక్కెట్ ఇవ్వడానికి సుముఖంగా లేరని తెలిసింది. ఎన్నికల వరకు పార్టీ అప్పగించిన బాధ్యతలకు అమర్‌ను పరిమితం చేయాలన్న యోచనలో జగన్ ఉన్నట్లు కనిపిస్తోంది.

ప్రగతి పథంలో ఇగ్నో

- విశాఖ ప్రాంతీయ కార్యాలయానికి జాతీయ స్థాయిలో గుర్తింపు
- 20న 37వ స్నాతకోత్సవం
- 'ప్రజాశక్తి'తో వర్సిటీ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కేంద్రంగా ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం ద్వారా ఎంతో మంది విద్యార్థులకు దూర విద్యను అందిస్తూ ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నామని ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు అన్నారు. ఇటీవల వర్సిటీ సాధించిన విజయాలను, పలు సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను ఆయన 'ప్రజాశక్తి'కి తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఇగ్నోలో విద్యనభ్యసించిన వారి గురించి వివరిస్తారా ?

ఇగ్నో విశాఖ పట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో ఇప్పటి వరకూ 62 వేల మంది విద్యను అభ్యసించారు. అందులో 45 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఫిబ్రవరి 20న నిర్వహించనున్న 37వ స్నాతకోత్సవంలో మరో 1500 మందికి పట్టాలు అందించనున్నాం. వారిలో సుమారు 900 మంది డిగ్రీ, 600 మంది పీజీ పట్టాలు పొందనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దామోదరం సంజీవయ్య లా వర్సిటీ వీసీ ఆచార్య డాక్టర్ సూర్య ప్రకాష్‌రావు హాజరుకానున్నారు.

ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం పరిధి ఎంత వరకూ ఉంది ?

ఇగ్నో ప్రాంతీయ కేంద్రం విశాఖపట్నంలో మిగతా 2లో..

కుటుంబం ఆత్మహత్యాయత్నం - యజమాని మృతి

వార్త 3లో..

బాల్య కేన్సర్‌పై అవగాహన అవసరం

వార్త మెయిన్‌లో..

దక్షిణలో పోటీకి జనసేన సన్నాహాలు

వార్త 2లో..

జిల్లా గ్రంథాలయ సంస్థకు

జివిఎంసి సెస్ బకాయి రూ.140 కోట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థకు జివిఎంసి రూ.140 కోట్లు సెస్ బకాయి పడిందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కొండా రాజీవ్ గాంధీ తెలిపారు. బకాయి సొమ్మును చెల్లించాలని జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మకు ఇటీవల వినతి పత్రం సమర్పించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా భారీ మొత్తంలో సెస్ బకాయి పడిందన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి ఈ విషయమై విజ్ఞప్తి చేయగా ఆయన ఆదేశాల మేరకు ప్రతి నెలా రూ.50 లక్షలు చొప్పున జివిఎంసి జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించేందుకు అంగీకరించిందన్నారు. అంగీకరించిన మేరకు రూ.50 లక్షలు చొప్పున జివిఎంసి చెల్లిస్తూ వచ్చినప్పటికీ నాలుగు మాసాలుగా ఆ సొమ్మును చెల్లించడం లేదన్నారు. వెంటనే బకాయి చెల్లించాలని కోరారు. తాను ఛైర్మన్‌గా బాధ్యత చేపట్టిన తర్వాత జగదాంబ జంక్షన్ సమీపంలో ఉన్న

మాట్లాడుతున్న కొండా రాజీవ్ గాంధీ

తమ సంస్థ ఎకరా స్థలంలో రూ.24 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన భవనాన్ని నిర్మించాలని ప్రతిపాదించామని, ఈ మేరకు అంచనాలు సిద్ధం చేశామని అన్నారు. అందుకోసం రూ.2 కోట్లను గ్రంథాలయ సంస్థ నుంచి నిధుల రూపంలో విడుదల చేశామన్నారు. అనుకున్న విధంగా నూతన భవన నిర్మాణం మిగతా 2లో..

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

ఏర్పాట్ల పరిశీలనలో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

ప్రజాశక్తి - విశాఖపట్నం : అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ పిఎస్.ప్రద్యుమ్న జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ నెల 13న విశాఖ వేదికగా జరిగే 'ఆడుదాం - ఆంధ్ర' ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి విచ్చేస్తున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి ఎసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు అధికారులంతా స్టేడియంలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రద్యుమ్న మాట్లాడుతూ సమన్వయ లోపం తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. పూర్తి స్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రాష్ట్రంలో నిర్వహిస్తున్న మొదటి

ఎసిఎ విడిసిఎ స్టేడియంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న ప్రద్యుమ్న

కార్యక్రమం ఇదేనని తెలిపారు. 13వ తేదీ సాయంత్రం జరిగే కార్యక్రమ షెడ్యూల్‌ను అధికారులకు వివరించారు. అన్ని విభాగాల అధికారులు చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశకాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు యంత్రాంగం సమన్వయ మిగతా 2లో..

దక్షిణలో పోటీకి జనసేన సన్నాహాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ఈసారి కూడా జనసేన పార్టీ పోటీ చేయాలని సన్నాహాలు చేసుకుంటోంది. 2019 ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆ పార్టీ అభ్యర్థి గంపల గిరిధర్‌కు 18 వేలకు పైగా ఓట్లు లభించాయి. ఆయన మత్స్యకార సామాజిక తరగతికి చెందినవారు. 2021 మార్చిలో జరిగిన జివిఎంసి ఎన్నికలలో జనసేన ఈ నియోజకవర్గంలో ఏడు వార్డులలో పోటీ చేసింది. వీటిలో 33వ వార్డు నుంచి పోటీ చేసిన ఆ పార్టీ అభ్యర్థి భీశెట్టి వసంత లక్ష్మి విజయం సాధించారు. 37 వార్డులో కూడా జనసేన 2152 ఓట్లు సాధించి వైసిపి, టిడిపి అభ్యర్థులకు గట్టి పోటీనిచ్చింది. ఇక్కడ వైసిపి స్వల్ప ఆధిక్యతతో విజయం సాధించింది. మారిన రాజకీయ పరిస్థితులలో ఈ నియోజకవర్గంలోని 32, 39 వార్డుల కార్పొరేటర్లు కందుల నాగరాజు, మహమ్మద్ సాధిక్‌లు ఇటీవల జనసేన పార్టీలో చేరారు. నిజానికి వీరిద్దరూ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొంది ఆ తర్వాత వైసిపిలో చేరారు. ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ప్రస్తుతం నియోజవర్గంలో జనసేన కార్పొరేటర్ల సంఖ్య మూడుకు చేరింది. ఈ నియోజకవర్గంలో అధికంగా ఉన్న మత్స్యకారుల ఓట్లపై జనసేన ఫోకస్ కొనసాగుతోంది.

ఈ నియోజకవర్గంలోని ఫిషింగ్ హార్బర్‌లో నవంబర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 20 బోట్లు దగ్ధమై భారీ నష్టం జరిగింది. స్పందించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ హార్బర్‌కు చేరుకొని బోట్లు కోల్పోయిన ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే నియోజకవర్గంలో ఇటీవల వార్డుల వారీగా జనసేన పార్టీ కార్యాలయాలను నాయకులు ప్రారంభిస్తున్నారు. పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ నియోజవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. అయితే ఇదే నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తూ ఏడాదికాలంగా పనిచేస్తున్నారు. ఇప్పుడు ఆయన్ని కాదని పొత్తులో వంశీకృష్ణకు టికెట్ ఇస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది.

37వ వార్డులో కార్యాలయం ప్రారంభం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కొద్ది రోజుల్లో కనుమరుగు కానుందని జనసేన అర్బన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం దక్షిణ నియోజకవర్గంలోని 37వ వార్డులో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. పార్టీ వార్డు అధ్యక్షులు గరికన రవి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.శివప్రసాద్ రెడ్డి, జివిఎంసిలో జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, వారాహి యాత్ర కో - ఆర్డినేటర్ శ్రీనివాస్ పట్నాయక్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

జివిఎంసి సెస్ బకాయి రూ.140 కోట్లు

జరగాలంటే జివిఎంసి బకాయి ఉన్న మొత్తం సొమ్మును చెల్లించాల్సి ఉందన్నారు. ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించామని, రూ.25 కోట్లు 90 లక్షల అంచనా బడ్జెట్‌ను ఆమోదించామని తెలిపారు.

ప్రగతి పథంలో ఇగ్నో

2011 మార్చి 29న ఏర్పాటైంది. ఏపిలో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం రెండోది. ప్రస్తుతం 11 జిల్లాల పరిధిలో 12 అధ్యయన కేంద్రాలను నిర్వహిస్తున్నాం. ఈ కేంద్రాల ద్వారా విద్యార్థులు తమ అనుమానాల నివృత్తి చేసుకోవచ్చు. అన్ని సెంటర్లలో మా సిబ్బంది అందుబాటులో ఉంటారు. మరొక అధ్యయన కేంద్రాన్ని త్వరలోనే విశాఖపట్నం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేయనున్నాం.

అందిస్తున్న కోర్సులు గురించి వివరించండి?

ఇగ్నో 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలకు ప్రకటన జారీ చేసింది. వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాలకు అప్లికేషన్లు జరుగుతున్నాయి. అంతేకాకుండా 2024 విద్యా సంవత్సరానికి మల్టీ డిసిప్లినరీ విధానంలో 19 రకాల డిగ్రీ కోర్సులను ఆర్ట్స్, సైన్స్, కామర్స్ విభాగాల్లో నాలుగేళ్ల దూరవిద్యా డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టింది. ఈ మల్టీ డిసిప్లినరీ కోర్సులు డిగ్రీ చదివిన తరువాత ఉపాధి కోరుకునే వారికి, దేశ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి, పరిశోధన రంగంలోకి వెళ్లాలనుకునే వారికి అనుకూలంగా ఉంటాయి. వీటితో పాటు ఈ ఏడాది నుంచి బిఇడి, బిఎస్సీ నర్సింగ్, పిహెచ్‌డి కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నాం.

కెన్యా ఓపెన్ యూనివర్సిటీతో చేసుకున్న ఒప్పందం ఏంటి ?

ఇగ్నో విద్యారంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. న్యూఢిల్లీలో జరిగిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమంలో కెన్యా ఓపెన్ యూనివర్సిటీతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుని సంతకాలు చేసింది. రెండు సంస్థల మధ్య విద్యార్థుల, అధ్యాపకుల, అత్యున్నత సాంకేతిక సహకారంతో విద్యాబోధన, కెన్యా ఓపెన్ యూనివర్సిటీ సిబ్బందికి శిక్షణ, ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సుల రూపకల్పన, ఆన్‌లైన్ విద్యాబోధనలో సహకారం, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో చేయూతనివ్వడం, విద్యా సంబంధిత వనరులు పంచుకోవడం వంటివి ఒప్పందంలో ఉన్నాయి.

ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం సాధించిన విజయాలను తెలియజేస్తారా ?

విశాఖపట్నం కేంద్రం జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ కేంద్రంగా ఎంపికయింది. 2023వ సంవత్సరానికి సంబంధించిన ఉత్తమ ప్రాంతీయ కేంద్ర అవార్డును న్యూఢిల్లీలో జరిగిన ఇగ్నో వ్యవస్థాపక వేడుకల్లో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినియ్ కుమార్ సక్సేనా చేతులు మీదుగా ఈ అవార్డును నేను అందుకున్నాను.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

ఏర్పాట్లు చేస్తోందని పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు సాధారణ ప్రజలకు ఆహారం, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు, శాప్ నుంచి ఒక్కొక్క ఇన్‌ఛార్జిని నియమిస్తున్నామని వెల్లడించారు. స్టేడియం లోపల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా, వీక్షకులు వచ్చి కూర్చునేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. స్టేడియం లోపల ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు అనువుగా ప్రధాన స్టేజి ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య శిబిరాలు, పారిశుధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నామని తెలిపారు. స్టేడియం వద్ద సమావేశం అనంతరం జిల్లా అధికారులంతా మధురవాడ ఐటి హిల్స్ వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. సమావేశంలో శాప్ ఎమ్‌డి ధ్యాన్‌చంద్ర, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, ఎడిసి కెఎస్.విశ్వనాథన్, డిసిపి మణికంఠ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న ప్రతినిధులు

ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత స్వాతంత్ర్యోద్యమంలో జైలు జీవితం అనుభవించిన గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావుకు భారతరత్న ఇవ్వాల్సిన అవసరముందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ కె.సుహాసిని పేర్కొన్నారు. గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఘంటసాల వర్ధంతి సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఆత్రేయ స్మారక కళా పీఠం వ్యవస్థాపకుడు గంటి మురళి, చెన్నా తిరుమలరావు, నండూరి రామకృష్ణ, బొమ్మిడి సత్యనారాయణ, మహ్మద్ ఖాన్, పిఎస్.తిలక్, శ్యామ్ సుందర్, కామేష్, దేవిశ్రీ, రుద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ శివశంకర్ విద్యా సంస్థల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ శివ శంకర్ విద్యా సంస్థలు ప్రారంభించి 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఎంవి.సుధ ఆధ్వర్యంలో మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనసేన నగర అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో విద్యాలయాల పాత్ర కీలకమైనదన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే నైజం వున్న సుధాఅప్పారావు దంపతులను ఈ సందర్భంగా అభినందించారు. మరొక అతిథి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ ప్రతిఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అత్యుత్తమ విద్యను అందిస్తున్న శ్రీ శివశంకర్ విద్యా మందిర్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ డి.రాంబాబు, వైసిపి నాయకులు మొల్లి అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

డ్యాన్సులతో ఆకట్టుకున్న విద్యార్థులు

రైట్ టు హెల్త్ బిల్లు తీసుకురావాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రైట్ టు హెల్త్ బిల్లును తీసుకురావాలని ప్రజా ఆరోగ్య వేదిక గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కెవిఎస్.సాయి ప్రసాద్, టి.కామేశ్వరరావు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. లేఖలోని అంశాలను వారు ఆదివారం మీడియాకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో ఆరోగ్య రంగంలో ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో చేపట్టిన సంస్కరణలకు జన్ స్వస్థ అభియాన్ (జెఎస్ఎ) అనుబంధ సంస్థ అయిన ప్రజా ఆరోగ్య వేదిక అభినందనలు తెలియజేసిందని తెలిపారు. రాజస్థాన్ ప్రభుత్వం 2023లో అశోక్ గెహ్లాట్ నేతృత్వంలో తీసుకొచ్చిన ఆరోగ్య హక్కు బిల్లుపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో తాము ఆరోగ్య హక్కు ప్రతిపాదిత బిల్లుపై సమగ్ర చర్చలు, సమావేశాలు నిర్వహించామని లేఖలో పేర్కొన్నారు. అలాగే ఈ బిల్లుపై ప్రజల నుంచి ముఖ్యంగా వైద్యులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, ఇతర మేధావుల నుంచి అభిప్రాయాలు, సూచనలను తీసుకున్నామని తెలిపారు. ఇన్ని చర్చల తర్వాత రాష్ట్రంలో కూడా ఈ బిల్లు తీసుకురావాలని వారంతా ఆకాంక్షిస్తున్నట్లు లేఖ ద్వారా ముఖ్యమంత్రికి తెలిపారు. అటువంటి చట్టాన్ని తీసుకురావడం ద్వారా ఆరోగ్య హక్కును సాధించవచ్చుని, ఇది సామాన్య ప్రజలకు గొప్ప ఊరటనిస్తుందని లేఖలో అభిప్రాయపడ్డారు. కాబట్టి ఆరోగ్య హక్కు ప్రతిపాదిత ముసాయిదా బిల్లు తీసుకురావడానికి రాజస్థాన్ బిల్లును కూడా జతపరిచామని వారు తెలిపారు. లేఖను పరిశీలించి రైట్ టు హెల్త్ బిల్లు ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

ప్రజాశక్తి -రంపచోడవరం: పౌష్టికాహారం, ఆకుకూరలు తింటే రక్తహీనతను నివారించవచ్చని వేద స్టైన్ సెంటర్ గైనకాలజిస్ట్ డాక్టర్. పి లక్ష్మి మదుల అన్నారు. ఆదివారం రంపచోడవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేద స్టైన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. లక్ష్మి మదుల మాట్లాడుతూ. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే, పుట్టిన బిడ్డతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉంటుందని, ప్రసవ సమయంలో ప్రాణాపాయ ప్రమాదం లేకుండా ఉంటుందన్నారు. గర్భిణులు ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్లను విధిగా వాడాలన్నారు. డాక్టర్ తేజో ఫణీంద్ర మాట్లాడుతూ దేశంలో ఊపిరితిత్తులు టిబి తర్వాత వెన్నుముక టిబి ఎక్కువగా వస్తుందన్నారు. పోషకాహారం లోపం వల్ల, వ్యాధినిరోధకశక్తి తగ్గి గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వెన్నుముక క్షయవ్యాధి బారిన పడుతున్నారన్నారు. దీన్ని అశ్రద్ధ చేస్తే, కాళ్లలో బలహీనత వచ్చి పక్షవాతం వచ్చే అవకాశం ఉందన్నారు. నడుము నొప్పితో పాటు. జ్వరంతోపాటు బరువు, ఆకలి తగ్గితే వెన్నెముక వైద్యనిపుణులను సంప్రదించాలని సూచించారు..శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మంగా బొజ్జయ్య సందర్శించి మందులు పంపిణీ చేశారు. పెద్దసంఖ్యలో రోగులు తరలివచ్చారు.

ఆదివాసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజకీయ పార్టీలు వారి స్వార్థం కోసం నకిలీ గిరిజనులకు సీట్లు కేటాయించి, అసలైన ఆదివాసీలకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని జనజాతి సురక్ష మంచ్ రాష్ట్ర కన్వీనర్ ఉప్పేటి నాగేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయినా గిరిజనులకు రిజర్వ్ చేసిన స్థానాలలో స్థానిక గిరిజనులకు కాకుండా నకిలీ సర్టిఫికెట్లతో గిరిజనులుగా చలామణి అవుతూ బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారికి, గిరిజనేతరులకు బినామీలుగా వ్యవహరిస్తున్న వారికి, గిరిజనేతరులను పెళ్లి చేసుకొని గిరిజన ఆచార సాంప్రదాయాలు విడినడినటువంటి వారికి సీట్లు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ క్రాంతిరాజ్ పాల్గొన్నారు.

మాతృభాష పట్ల ఆసక్తి పెంచాలి

బహుమతులు అందిస్తున్న యువిఎవిఎన్.రాజు

ప్రజాశక్తి -పద్మనాభం : మాతృ భాష పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచాలని సువథ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు యువిఎవిఎన్.రాజు సూచించారు. పద్మనాభంలో సువథ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన గోస్తని విద్యాపీఠ్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన సువథ ప్రతిభ పరీక్షకు 17 పాఠశాలలకు చెందిన 452 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో యువిఎవిఎన్.రాజు మాట్లాడుతూ, సువథ సేవా సంస్థ ద్వారా గత 20 ఏళ్లుగా విద్యార్థులలో మాతృభాష పట్ల ఆసక్తి కలిగిస్తున్నామన్నారు. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ, మానవతా విలువలను పెంపొందించడానికి ఈ ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థి దశ నుంచి సంస్కారాలను పెంపొందించడం వల్ల ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారన్నారు. రామాయణం, మహాభారతం వంటి గ్రంథాల పరిచయం బాల్యంలోనే జరగాలన్నారు. తెలుగులో రామాయణం గురించి ప్రజలకు వివరించిన శ్రీభాష్యం అప్పలాచార్యులు వంటి గొప్ప మహనీయులు జన్మించిన పద్మనాభం గ్రామం ఎంతో ప్రఖ్యాతిని పొందిందని పేర్కొన్నారు. ఇటువంటి మహనీయుల గొప్పతనం గురించి ఈతరం వారు తెలుసుకోవాలన్నారు.

ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిపి కె.రాంబాబు మాట్లాడుతూ, మాతృభాషపై విద్యార్థులకు ప్రావీణ్యం తగ్గిపోతున్న దశలో సువథ ప్రతిభా పరీక్షల ద్వారా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం పద్య పఠనం, శ్లోక పఠనం, తెలుగు నేర్చుకుందాం, గేయాలు, రామాయణం క్విజ్ తదితర పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ గాడు ఎల్లాజీరావు, ఎంపిటిసి సభ్యులు కంటుబోతు లక్ష్మి, స్థానిక నాయకులు పద్దు సత్యనారాయణ తదితరులు పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎవిఆర్.శర్మ, ఎ.దేముడు, టి.ఎర్రయ్య, కె.శ్రీను, ఎన్.రాము తదితరులు పాల్గొన్నారు.

180 పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని దాకమర్రిలో ఆదివారం ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ ఆధ్వర్యాన ఆదివారం పశువికాస్ పేరిట నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో 180 పశువులకు వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ విశాల్ షిండే మాట్లాడుతూ, తమ సంస్థ వివిధ రకాల సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డివిఎస్ఎన్ఎన్.రాజు, సర్పంచ్ చెల్లూరి పైడిపుడు, ఎంపిటిసి సభ్యులు నగేష్‌బాబు, వైసిపి నాయకులు పొట్నూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

75 మంది రక్త దానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విగ్గ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఫౌండేషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరంలో 75 మంది రక్తదానం చేశారు. విశాఖ బ్లడ్ సెంటర్ వైద్యులు, సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. విశాఖ హార్బర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కలిగొట్ల శ్రీదేవి జయంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామ చంద్రమూర్తి, ప్రతినిధులు సూర్యనారాయణ మూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

పాండ్రంగి, రేవిడిలో పల్లెకు పోదాం

ప్రజాశక్తి- పద్మనాభం: మండలంలోని పాండ్రంగి, రేవిడి గ్రామాల్లో బిజెపి నాయకులు ఆదివారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాని మోడీ పరిపాలన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ, నాయకులు కె.రామానాయుడు, రవికుమార్, అప్పలరమణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బావుల్లో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి నరవ గ్రామంలో ఉన్న బావుల్లో చెత్త పేరుకుపోయి నీరంతా కలుషితమైంది. పంచాయతీలు జివిఎంసి పరిధిలో విలీనం కావడంతో బావులను పట్టించుకోవడం మానేశారు. ఈ బావుల్లో ఉన్న నీటిని మాత్రం ప్రజలు వాడుతున్నారు. గల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యాన స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ కలుషితమైన నీరు వాడడం వల్ల చర్మ వ్యాధులు వచ్చి అనారోగ్య పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బావుల్లో పూడికలు తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

బావిలో పేరుకుపోయిన చెత్త

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి

ప్రజాశక్తి -ఆనందపురం : వైసిపి ప్రభుత్వం కుట్రపూరిత చర్యలు మానుకొని అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలని భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు డిమాండ్ చేశారు. ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం పట్టాలు పంపిణీ చేస్తారన్నవిషయం తెలుసుకొని కోరాడ రాజబాబు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, వేములవలసలోని పేద లబ్ధిదారులకు ఇల్లు పట్టాలు ఇవ్వకుండా కేవలం దురుద్దేశంతో గ్రామ సభ పెట్టకుండా 97 మందిని మాత్రమే సచివాలయానికి పిలిపించుకొని తూతూ మంత్రంగా డ్రా ద్వారా ఇళ్ల పట్టాలు మంజూరు చేయడాన్ని ఖండించారు. దీనిపై తహశీల్దార్‌ను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలతో దాటవేశారని విమర్శించారు. దీనిపై ఆర్‌డిఒ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. లబ్ధిదారులైన పేదలందరికీ ఇళ్లు వచ్చేదాకా పోరాటం చేస్తానన్నారు. గత 20 ఏళ్లుగా లబ్ధిదారుల తరపున పోరాటం చేసి గత తహశీల్దార్‌తో పేదల కోసం జాబితా తయారుచేయగా ఇప్పుడు దానిని కాదని వైసిపి స్వలాభం కోసం కొంతమందికి మాత్రమే ఇళ్లు ఇచ్చి డ్రా తీసి నెంబర్ల ప్రకారం స్థల కేటాయింపులు చేయడాన్ని తప్పుపట్టారు. లబ్ధిదారులైన 357 మందికీ పట్టాలిచ్చి భూ హక్కును కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

సృజనాత్మక ఆలోచనలను పెంపొందిస్తున్నాం

వార్షికోత్సవ ముగింపులో ఆలివర్‌రాయి

సభలో మాట్లాడుతున్న ఆలివర్‌రాయి

ప్రజాశక్తి -తగరపువలస : చదువంటే కేవలం పాఠ్య పుస్తకాలను బట్టీ పట్టి చదివించడం కాదని, విద్యార్థుల్లో సృజనాత్మకతతో కూడిన ఆలోచనలను పెంపొందించేలా తమ విద్యా సంస్థ కృషిచేస్తున్నట్లు కేథరిన్ విద్యా సంస్థల డైరెక్టర్ ఆలివర్‌రాయి తెలిపారు. చిట్టివలస ఫుట్ బాల్ గ్రౌండ్‌లో శనివారం ప్రారంభమైన కేథరిన్ విద్యాసంస్థల 40వ వార్షికోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో తమ సంస్థలో విద్యనందిస్తున్నామని వివరించారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటుచేసిన సంస్థ ఇంతగా విస్తరించుటలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. ఈ సభలో కేథరిన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు రత్నరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆలోచింపజేశాయి.

కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎన్‌టిఆర్ సేవాసమితి, గీతం ఆసుపత్రి సంయుక్తాధ్వర్యాన ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. పెదగదిలి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హాజరై సుమారు 91 మందికి కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతం ఆసుపత్రి యాజమాన్యం పేదలకు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు..

12వ వార్డు టిడిపి ఆధ్వర్యాన పెదగదిలి కూడలిలో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు. అర్హత కలిగిన యువకులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేస్తుకున్నారు.

రోగులకు కళ్లద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

నేరాలు ఘోరాలు

కుటుంబం ఆత్మహత్యాయత్నం

- యజమాని మృతి

ప్రజాశక్తి-పద్మనాభం : అప్పులు, అనారోగ్యం కారణంగా పద్మనాభం మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... ఏనుగులపాలెం గ్రామానికి చెందిన కొమ్మూరి చెన్నయ్య (49) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి, పిల్లల చదువులకు ఫైనాన్స్ వాడాడు. ఫైనాన్స్ తీర్చడానికి మరిన్ని అప్పులు చేశాడు. అతని భార్య మంగ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వీటన్నింటితో మనస్తాపం చెంది శనివారం సాయంత్రం చెన్నయ్య మద్యం తాగి ఇంటికి వెళ్లి అందరమూ చనిపోదామని భార్య, ఇద్దరు ఆడపిల్లలతో చెప్పి నలుగురూ నిద్రమాత్రలు మింగారు. అందరూ స్పృహ తప్పి పడిపోయారు. దీన్ని గమనించిన చెన్నయ్య తమ్ముడు కొమ్మూరి వెంకన్న 108కి, పోలీసులకు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చేసరికి ఇంటి యజమాని చెన్నయ్య మృతిచెందాడు. తల్లి, ఇద్దరు పిల్లలను ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. వారి ఆరోగ్యం బాగానే ఉంది. అప్పటికే మద్యం తాగి ఉండటం, తర్వాత నిద్ర మాత్రలు మింగటంతో చెన్నయ్య మృతిచెందాడు. పద్మనాభం సిఐ నేతృత్వంలో ఎస్ఐ జె.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామంలోని బహిరంగ ప్రదేశంలో పేకాటాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి, నలుగురు పేకాట ఆడుతుండగా పట్టుకున్నామని, నిందితుల నుంచి రూ. 4260 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- కె.కోటపాడు : పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్న భర్తను భార్య నిలదీయడంతో మనస్తాపంతో గడ్డి మందు తాగి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలివి. మండలంలోని చౌడువాడ గ్రామానికి చెందిన శానాపతి అంజి (37) అనారోగ్యంతో బాధపడుతూ, నెల రోజులుగా పనిలోకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. భర్త పనికి వెళ్లడం లేదని భార్య లక్ష్మి నిలదీయడంతో, మనస్తాపం చెంది శనివారం సాయంత్రం కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు.అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కంటైనర్ లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో బయ్యవరం జాతీయ రహదారిపై స్కూటీని కంటైనర్ లారీ ఢీకొన్న ఘటనలో ఆదివారం మహిళ మృతి చెందింది. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. సిఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలివి. చోడవరం మండలం అంబేరుపురం గ్రామానికి చెందిన దంపతులు కాశీ కనక శ్రీదేవి (40), కాశీ రాములు బైక్‌పైఎలమంచిలి మండలం ఏటికొప్పాకలోని బంధువుల ఇంటికి వెళుతుండగా, అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడి తీవ్రగాయాలైన కనక శ్రీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రాములుకు తీవ్రగాయాలు కావడంతో అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వినోద్‌బాబు తెలిపారు.

అవంతిలో...

నేడు ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఈ నెల 12వ తేదీన బిఎస్ఎన్ఎల్ సహకారంతో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరుకానున్నట్లు తెలిపారు. బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జె.ఆదం, డిజిఎం డాక్టర్ ఎ.సత్యప్రసాద్, ఎజిఎం బిఎస్.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు.

నియామక పత్రం అందుకుంటున్న భాస్కరరావు

అప్సా రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీగా భాస్కరరావు

ప్రజాశక్తి -గాజువాక : తిరుపతిలో జరిగిన ఎపి ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర మహా సభలో భాస్కర్ విద్యానికేతన్ కరెస్పాండెంట్ పాలవలస భాస్కర రావును అసోసియేషన్ రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర, వివిధ జిల్లాలకు సంబంధించి నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, అప్సా సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువమంది సభ్యులను చేర్పించి, ప్రతి సభ్యుని సంక్షేమానికీ కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు సుందరాం, చంద్రశేఖర్, రాము, రవీంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు, సెక్రటరీ సింహాచలం, జనార్దన్, శ్రీహరి, గణపతిరావు, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

మాధవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-మాధవధార : మాఘ మాసం సందర్భంగా మాధవధారలోని మాధవ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు దార వద్ద స్నానమాచరించి మాధవస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సనపల సత్యనారాయణ అన్నపూర్ణ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ప్రముఖ కాంట్రాక్టర్ సనపల సత్యనారాయణ పద్మావతి దంపతుల ఆర్థిక సహాయంతో 1200 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్జున్ అవార్డు గ్రహీత జయరాం, ఆలయ పూజారులు సనపల శ్రీనివాసరావు, సనపల వరాహనరసింహం, పప్పల వరహానరసింహం, సనపల లక్ష్మీనరసింహ, ప్రముఖ న్యాయవాది సనపల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిలక్

కళింగ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి 51వ వార్డు పరిధి మాధవధార ఉడా కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఖారవేల ఎడ్యుకేషనల్, కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పేడాడ నర్సింగరావు ఆధ్వర్యాన ఆదివారం కళింగ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ముందుగా బొడ్డేపల్లి రాజగోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాకుళం వైసిపి ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్ హాజరై మాట్లాడారు. రాజకీయంగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో కళింగులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తమ సామాజిక వర్గం నుంచి స్పీకర్‌గా తమ్మినేని సీతారామ్‌ను ఎంచుకోవడం గర్వకారణమన్నారు. తనను శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. కళింగ వర్గాన్ని అందరినీ ఒక వేదికమీదకు తీసుకొచ్చిన వైసిపి రాష్ట్ర మహిళా నాయకులు పేడాడ రమణి కుమారి తమకు పూర్తిస్థాయి మద్దతు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పప్పల రామ్మోహనరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రఘు, పేడాడ కృష్ణారావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, పప్పల సునీత పాల్గొన్నారు.

పైడిబాబు కుటుంబాన్ని పరామర్శించిన గణబాబు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డుకు చెందిన టిడిపి నాయకుడు కరుకు పైడిబాబు ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, పార్టీలో పైడిబాబు చురుకుగా పనిచేసేవారన్నారు. ఇటువంటి వ్యక్తి లేకపోవడం పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మజ్జి సోమేష్, ఉరుకూటి పైడిరాజు, బంక నారాయణరావు, పాసి చిన్న, సత్యాల శ్రీను పాల్గొన్నారు.

కణితి విస్తరణ పనుల్లో జాప్యం

ప్రజాశక్తి -గాజువాక : పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ ప్రకారం కణితి రోడ్డు బజార్‌ను విస్తరించాలని ఎన్నో సంవత్సరాలుగా ప్రతిపాదన చేస్తూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు నవంబర్ నెలలో విస్తరణ పనులు ప్రారంభించారు. రోడ్డుకిరువైపులా విస్తరణకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించారు. వీటిలో ఎక్కువగా దుకాణాలు ఉన్నాయి. అక్కడక్కడ గృహాలు కూడా ఉన్నాయి. తొలగించిన వరకు బాగానే ఉన్నప్పటికీ, విస్తరణకు సంబంధించిన కాలువ పనులు, రోడ్లు పనులు పూర్తికాకపోవడంతో మూడు నెలలుగా కణితిరోడ్డులో అడుగు పెట్టాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల పనులు ఇంకా పూర్తికాకపోవడంతో డ్రెయినేజీల నీరు రోడ్డుపైనే నిల్వ చేరుతోంది. పనుల కారణంగా అస్తవ్యస్తంగా ఉండటంతో నిత్యం రద్దీగా ఉండే మార్కెట్‌కు జనాలు సరిగా రావడంలేదు. చిరు వ్యాపారుల నుంచి పెద్ద షాపుల వారికి కూడా వ్యాపారాలు సాగడం లేదు. రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ రోడ్డులోకి వచ్చిన ద్విచక్ర వాహనదారులు గంటల తరబడి ఇరుక్కుపోతున్నారు. రోడ్డుమీద కాలువలకు సంబంధించిన ఇసుక, పిక్క వేయడంతో ప్రయాణానికి వీలు లేకుండా పోతుంది. సంబంధిత కాంట్రాక్టర్ పనులు సకాలంలో పూర్తి చేయడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ పనులు మూడు నెలల్లో పూర్తిచేయాలని గతంలో జివిఎంసి కమిషనర్ ఆదేశించినా పనులు అలానే ఉన్నాయి. ఈ పనులకు సంబంధించి విద్యుత్ స్తంభాలు కూడా మార్చాల్సి ఉంది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశముందని, అదే జరిగితే ఈ పనులు జులై వరకు పూర్తికావనే ఆందోళనలో స్థానిక ప్రజలు, వ్యాపారులు ఉన్నారు. ఇప్పటికైనా జివిఎంసి ఉన్నతాధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలని వారు కోరుతున్నారు. దీనిపై జివిఎంసి గాజువాక జోనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాదుబాబును వివరణ కోరగా, రెండువైపులా కొంతవరకు పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు కూడా పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కాలువల పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు.

కాలువలు పూర్తికాని కణితి మార్కెట్

క్రీడా మైదానంగా ఆదర్శగ్రౌండ్

ఉడా కాలనీలో ఉన్న ఆదర్శగ్రౌండ్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గం పరిధి ఉడా కాలనీలో ఏడెకరాల విస్తీర్ణంతో ఉన్న ఆదర్శగ్రౌండ్‌ను రూ.5 కోట్లతో క్రీడా మైదానంగా అభివృద్ధి చేయడానికి జివిఎంసి కమిషనర్ ప్రతిపాదనలు చేపట్టారు. మరో వారం రోజుల్లో శంకుస్థాపన చేయడానికి కూడా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకముందే శంకుస్థాపన చేయాలనే ఆలోచనలో జివిఎంసి అధికారులు ఉన్నారు. గతంలో నలుగురు ఎమ్మెల్యేలు దీనికి శంకుస్థాపన చేసి పనులు చేపట్టకుండా విడిచిపెట్టేశారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ క్రీడా మైదానానికి మళ్లీ కదలికలు వస్తున్నారు. ఈ పనులు పూర్తయితే గాజువాకలో ఉన్న క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గాజువాక నియోజకవర్గం మొత్తానికి ఇది ఒకటే విశాలమైన క్రీడా మైదానంగా ఉంది. ఎన్నో సంవత్సరాలుగా ఎన్నికల హామీగానే మిగిలిపోతున్న ఈ క్రీడామైదానం ఈసారైనా కార్యరూపం దాల్చుతుందానని స్థానికులు ఎదురుచూస్తున్నారు. క్రీడామైదానం అభివృద్ధికి గతంలో హెచ్‌పిసిఎల్ ఇచ్చిన రూ.7 కోట్లు పనులు జరగక వెనక్కి వెళ్లిపోయిన సంగతి విధితమే.

సూరమ్మ మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి -పిఎం.పాలెం : మధురవాడ పిహెచ్‌సిలో 25 సంవత్సరాలుగా కంటింజెంట్ కార్మికురాలుగా సేవలందించిన సియ్యాద్రి సూరమ్మ శనివారం మృతిచెందారు. కొమ్మాది గ్రామంలో వారి స్వగృహం వద్ద ఆదివారం మృతదేహాన్ని సందర్శనార్థం ఉంచారు. సూరమ్మ భౌతిక కాయం వద్ద సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ, కంటింజెంట్ కార్మికురాలుగా సూరమ్మ చాలీచాలని జీతంతో అనేక సంవత్సరాలుగా వృత్తిని నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించారని కొనియాడారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, అవుట్ సోర్సింగ్ అండ్ కాంట్రాక్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి.మణి, కెవిపిఎస్ నాయకులు సుబ్బన్న, ఎంవి ప్రసాద్, కె.రాజు, జి.కిరణ్, ఐద్వా నాయకులు బి.భారతి, సిఐటియు నాయకులు డి.కొండమ్మ, జి.గురుమూర్తిరెడ్డి, సిహెచ్.శేషుబాబు, పి.రాజశేఖర్, ఆశ, అంగన్‌వాడి, మున్సిపల్ యూనియన్ల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

సూరమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు తదితరులు

హెచ్‌పిసిఎల్‌లో ఎక్స్ఛేంజర్ ట్యూబ్ బండిల్ల చోరీ

ప్రజాశక్తి -ములగాడ : హెచ్‌పిసిఎల్‌లో రూ.కోటి విలువైన ఎక్స్ఛేంజర్ ట్యూబ్ బండిళ్లు చోరీకి గురయ్యాయి. దీనిపై హెచ్‌పిసిఎల్ మెయింటినెన్స్ సీనియర్ మేనేజర్ ధీర్‌సింగ్ మల్కాపురం క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేసి సీసీ కెమెరా ఆధారంగా విఆర్ యార్డులో ట్యూబ్ బండిళ్లు దొంగిలించినట్లు గుర్తించారు. ఐదు ట్యూబ్ బండిళ్లు ఉన్న ట్రక్కును క్రేన్ సహాయంతో హెచ్‌పిసిఎల్ ఎటిపి నార్త్ గేట్ ద్వారా బయటకు తీసుకెళ్లినట్లు క్రైమ్ పోలీసులు గుర్తించారు. ప్రాథమిక విచారణ అనంతరం సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్లో ఒకరైన పిల్లి ప్రశాంత్, హెచ్‌పిసిఎల్‌లో పనిచేస్తున్న కార్మికులు పిల్లి శివ కుమార్, డివి.రెడ్డి, యలమంచిలి పెంటారావుతో పాటు మరికొందరు కలిసి ఈ కుట్రకు పాల్పడ్డారని పోలీసులు నిర్ధారించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంస్థలో పనిచేసిన ఉద్యోగులందరినీ సిఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీ చేస్తారని, వారే ఇటువంటి పనులకు పూనుకుంటే ఇంకెవరు తనిఖీ చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంస్థ భద్రతపై పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

రౌడీలు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రౌడీలు క్రమశిక్షణతో మెలగాలని, లేకుంటే నగర బహిష్కరణ తప్పదని నాలుగో పోలీసుస్టేషన్ సిఐ ఎస్.విజయ్‌కుమార్ హెచ్చరించారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, రౌడీలు తమ పని తాము చేసుకోవాలని, అనవసర విషయాల్లో, భూతగాదాల్లో తలదూర్చకుండా ఉండాలని చెప్పారు. లేకుంటే పీడీ యాక్ట్ తెరవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ద్వారక పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ రౌడీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీలు క్రమశిక్షణతో మెలగాలని, అనవసర తగాదాలు, సెటిల్‌మెంట్లులో తలదూర్చవద్దని సిఐ రమేష్ హెచ్చరించారు.

కంబాల కొండపై ట్రెక్కింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఉదయం 7 గంటలకు కంబాల కొండకు చేరుకొని ట్రెక్కింగ్ నిర్వహించారు. ఆనంతరం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామ్‌నరేష్ బిర్లంగి మాట్లాడుతూ, వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తోటి వారికి సహాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు, సెక్రటరీ జిపిఆర్ విఠల్‌రావు, కమిటీ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

జనం లేక వికసిత్ భారత్ సభ రద్దు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధి దల్లివానిపాలెంలో బిజెపి ఏర్పాటుచేసిన వికసిత్ భారత్ సభ జనం లేక రద్దయింది. కేంద్ర ప్రభుత్వ పథకాలు చెప్పుకోవడానికి ఏర్పాటుచేసిన ఈ సభకు స్థానిక వార్డు ప్రజలతో పాటు, జివిఎంసి అధికారుల హాజరు కాకపోవడంతో రద్దయింది. స్థానిక వార్డు కార్పొరేటర్ వంశీరెడ్డి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అడ్డుకున్నారని బిజెపి నాయకులు ఆరోపిస్తున్నారు. మరలా ఈ సభ పెడతామని చెబుతున్నారు. ప్రతి వార్డులోనూ నెలరోజుల పాటు ఈ సభ జరుగుతుందని తెలిపారు.

ఆనకట్ట పునర్నిర్మాణం మంగళమేనా?

- శంకుస్థాపన చేసిన మూడు నెలలైనా కదలని పనులు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు
- పట్టించుకోని అధికారులు, నేతలు
- తక్షణం చేపట్టకుంటే వచ్చే ఖరీఫ్‌కు సాగునీరు కష్టమే

గండిపడిన మంగళాపురం ఆనకట్ట

ప్రజాశక్తి- చోడవరం : ఇరిగేషన్ అధికారులు అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరశి మంగళాపురం ఆనకట్ట నిర్మాణానికి అడ్డంకిగా మారింది. నిధులు మంజూరైనా, పునర్నిర్మాణ పనులకు నోచుకోక వందలాది ఎకరాల ఆయకట్టు బీడులుగా మారే దుస్థితి నెలకొంది. ఇదీ బుచ్చయ్యపేట మండలం మంగళాపురం ఆనకట్ట దుస్థితి. దీంతో సస్యశ్యామలంగా ఉండాల్సిన ఆయకట్టు భూముల్లో సాగు ప్రశ్నార్ధకమై, బీడులను తలపిస్తున్నాయి. మంగళాపురం ఆనకట్ట పునర్నిర్మాణానికి నిధులు మంజూరు లేక పనుల్లో జాప్యం జరుగుతూ వచ్చింది.

2020లో కురిసిన వర్షాలకు మంగళాపురం ఆనకట్ట కొట్టుకుపోయింది. అప్పట్లో విజయరామరాజుపేట, మంగళాపురం రైతులు సుమారు రూ.రెండు లక్షలను సొంతంగా సమకూర్చుకొని, నీటి ప్రవాహానికి అడ్డంగా గట్టు వేసి, నది నీటిని కాలువకు మళ్లించారు. తర్వాత ఏడాది వచ్చిన వర్షాలకు రైతులు స్వచ్ఛందంగా వేసుకున్న గట్టుగండి పడడంతో ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. అప్పటినుండి మంగళాపురం, విజయరామరాజుపేట, కుముందాం పేట, చోడవరం మండలం లక్ష్మీపురం, చీడికాడ మండలం దిబ్బపాలెం, కె.అగ్రహారం గ్రామాలోని ఆయకట్టు భూములకు సాగునీరు దూరమైంది.

సాగు నీరు లేక బీడులుగా మారిన ఆయకట్టు భూములు

శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సత్యవతి తదితరులు (ఫైల్)

ఎంపీ నిధులిచ్చినా ముందుకు కదలని పనులు

ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ చొరవతో అనకాపల్లి ఎంపి డాక్టర్ బివి.సత్యవతి తన నియోజకవర్గ అభివృద్ధి కోటా నిధుల నుంచి రూ. 40 లక్షలను మంగళాపురం ఆనకట్ట పునర్నిర్మాణానికి కేటాయించారు. నిధులిచ్చిన ఎంపితోనే గత ఏడాది నవంబర్ నెలలో కాలువ వద్ద శంకుస్థాపన పనులు కూడా ఎంతో ఆర్భాటంగానే సాగాయి. దీంతో తమ సాగునీటి కష్టాలు తీరిపోతాయని, ఆయకట్టు సస్యశ్యామల మౌతుందని రైతులు ఎంతో ఆనందించారు.

అయితే శంకుస్థాపన చేసి మూడు నెలలు గడచినా సంబంధిత కాంట్రాక్టర్ నేటికీ పనులు చేయడానికి సన్నద్ధం కాలేదు. నీటి ప్రవాహం ఎక్కువ ఉండటం వల్ల పనులు చేయలేకపోతున్నామని కాంట్రాక్టర్ చెబుతున్నాడు. ఇది సరైన వాదన కాదని రైతులు అంటున్నారు. కోణాం రిజర్వాయర్ నుండి వచ్చే నీరు మంగళాపురం ఆనకట్టుకు రాకుండా కస్పా జగన్నాధపురం, కందివరం కాలువలకు మళ్లించినట్లయితే నీటి ప్రవాహం ఉండదని రైతులు అంటున్నారు. ఇది కారణం కాదని, సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటికే పలు పనులు చేసినప్పటికీ వాటికి బిల్లులు రాకపోవడం వల్లే మంగళాపురం ఆనకట్ట పనులు చేసేందుకు ముందుకు రావడం లేదనే విమర్శలూ ఉన్నాయి.

కన్నెత్తి చూడని అధికారులు, కాంట్రాక్టర్

మరోవైపు నిధులిచ్చిన నేతలు ఎంపి సత్యవతిగానీ, ఎమ్మెల్యే ధర్మశ్రీగానీ, ఇంకా సంబంధిత అధికారులెవరూ కనీసం చొరవ చూపకపోవడం, భయపడుతున్న కాంట్రాక్టర్‌కు భరోసానిచ్చి, పనులు చేయాలని ధైర్యం చెప్పే పరిస్థితి లేకపోవడమే పనులు జాప్యానికి కారణంగా తెలుస్తోంది.

ఇపుడు పనులు చేపడితే, వచ్చే ఖరీఫ్ సీజన్‌నాటికి పూర్తయి, ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉందని, అయితే నిర్మాణం చేపట్టే సూచనలు కనపడలేదని రైతులు అంటున్నారు. నిధులు మంజూరు చేస్తే ఏం లాభమని, పనులు చేస్తే తప్ప ఫలితం ఉండదని రైతులు వాపోతున్నారు. రైతు సమస్యలపై నిర్లక్ష్య ధోరణికి మంగళాపురం ఆనకట్ట పునర్నిర్మాణ పనులే నిదర్శనమని కొందరు ఆయకట్టు రైతులు వాపోతున్నారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే, ఎంపిలు చొరవ తీసుకుని పనులు ప్రారంభించేలా చూడాలని రైతుల కోరుతున్నారు.

ప్రజాసేవే పరమావధి కావాలి



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న బ్రాండిక్స్ దొరైస్వామి

ప్రజాశక్తి- అచ్యుతాపురం : ప్రజాసేవే పరమావధిగా ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ వి.దొరస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం అచ్యుతాపురంలో విష్ణు హాస్పిటల్ సురక్ష హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత వైద్యం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు హాస్పిటల్ వైద్యులు సేవాభావాన్ని కొనియాడారు. చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని పీడియాట్రీషియన్ డాక్టర్ వెంకట్ సూచించారు. ఉచిత వైద్యశిబిరాలకు ప్రజలు సహకరించాలని. విష్ణు సురక్ష హెల్త్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ ఎ.సుధీర్ కోరారు. ఉచిత వైద్య శిబిరంలో అచ్యుతాపురం సిఐ బుచ్చిరాజు, వైద్య నిపుణులు డాక్టర్ సంపత్, సుభద్ర, మనోరమ పాల్గొన్నారు.

శిబిరంలో 35మందికి కేన్సర్ స్కానింగ్,40 మందికి దంతపరీక్షలు, 29మంది చిన్నపిల్లలకు, 180 మంది సాధారణ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. 21 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. క్రైస్ట్ విద్యావిహార్ కరస్పాండెంట్ రెడ్డి గణేష్, ఎంపిటిసి లాలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యాన 340మందికి ఉచిత కంటి పరీక్షలు

అచ్యుతాపురం :బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్యసేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం 120వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.340 మంది కంటి రోగులను నేత్ర పరీక్షలు చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఉచిత కంటి వైద్యశిబిరంలో 242మందికి ఉచిత అద్దాలను అందించారు. 116మందికి మందులు ఇచ్చారు. దృష్టిలోపం ఉన్న 30మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు, సహాయకులకు మజ్జిగ, ఫలహారాలు, భోజనం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ, బ్రాండిక్స్ ఇండియా సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

ఉపముఖ్యమంత్రికి యుటిఎఫ్ నేతల వినతి

బూడికి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దుచేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్దరించాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు తారువలోని తన స్వగృహంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిపిఎస్ రద్దు చేసి, జిపిఎస్ కాకుండా ఒపిఎస్‌ను అమలు చేయాలని ,ఉద్యోగులకు 30శాతం ఐఆర్ ప్రకటించాలని వినతిపత్రం అందజేశారు

దీనిపై ఉపముఖ్యమంత్రి స్పందిస్తూ, ఉద్యోగ ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, కార్యదర్శి దొగ్గ శ్రీను, సీనియర్ నాయకులు కుదర కామరాజు, బొడ్డపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాష్ట్రం అధోగతి

- రూ.8 లక్షల కోట్ల అప్పుతో దిగజారిన ఆర్థిక స్థితి
- వైసిపి పాలనపై మాజీ మంత్రి, జనసేన నేత కొణతాల ఫైర్

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి - అనకాపల్లి: సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పుతో రాష్ట్ర ఆర్థిక స్థితి దిగజారిందని మాజీ మంత్రి, జనసేన నేత కొణతాల రామకృష్ణ ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక జనసేన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ,. రాష్ట్ర బడ్జెట్‌లో నాలుగోవంతు, అంటే దాదాపు రూ.53 వేల కోట్లను చేసిన అప్పులకు వడ్డీలకే ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు రూ.రెండు వేల కోట్లను విడుదల చేస్తామన్న హామీని ముఖ్యమంత్రి జగన్ గాలికొది లేశారన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు దెబ్బకు కొన్ని గ్రామాలు కొట్టుకుపోయాయన్నారు. 25 లక్షల ఇళ్లు నిర్మించామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం, ఈ ఐదేళ్లలో రూ.21 వేల 412 కోట్లకు గానుకేంద్రం 17,412 కోట్లు చెల్లించగా రాష్ట్రం కేవలం రూ.4000 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి నీటిపారుదల ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని, అయితే అతని కొడుకు జగన్మోహన్ రెడ్డి నీటి పథకాలను నిర్లక్ష్యం చేశారన్నారు. వ్యవసాయ రంగానికి ఈ ఐదేళ్లలో బడ్జెట్లో రూ.75 వేల 486 వేల కోట్లు పెట్టి కేవలం రూ. 49 వేల 63 కోట్లు మాత్రమే ఖర్చు చేశార న్నారు. ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామన్న హామీని తుంగలో తొక్కగా, డిఎస్‌సి నోటిఫికేషన్ జారీలోనూ నిరుద్యోగులను మోసం చేశారన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులుంటే, కేవలం 6,100పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి మభ్యపెట్టి, ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. ఇంగ్లీష్ మీడియం పేరుతో గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నారన్నారని, విద్యను పేదలకు దూరం చేసే చర్యలు చేపడతున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజాకంటక వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఘంటసాల గానం అజరామరం

ఘంటసాలకు నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ప్రజాశక్తి - యలమంచిలి : గాన స్వరబ్రహ్మ ఘంటసాల వేంకటేశ్వరరావు గాత్రానికి మరణం లేదని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఘంటసాల 50వ వర్ధంతిని ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాటల పోటీలను నిర్వహించగా, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన 42 మంది గాయనీ గాయకులు పాల్గొన్నారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ ఘంటసాల గానామృతాన్ని అభివర్ణించారు.. పాటమీద ఉన్న మక్కువతో విశాఖ, విజయ నగరం, హైదరాబాదు మొదలైన ప్రాంతాల నుండి కళాకారులు ఇక్కడకు రావడం ఆనందదాయకమన్నారు. పోటీల్లో పాల్గొన్న గాయకులను అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షులు పూరీ జగన్నాధం, కార్యదర్శి ఆర్‌వి. ఆంజనేయులు మాట్లాడుతూ కార్యక్రమం నిర్వహణకు స్థానికుల ప్రోత్సాహం, సహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపిపి బోదెపు గోవిందరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వర రావు, ఆరెపు వెంకటగుప్తా, నరవ, పిపిఎస్ అధ్యక్షులు మళ్ల కొండబాబు, లైబ్రేరియన్ ఆనంద్, ఆడిటర్ బంగారుశెట్టి పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి- మునగపాక: ఎలమంచిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సుందరపు విజయ్‌కుమార్ సమక్షంలో మునగపాక, మడకపాలెం గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. వీరికి స్థానిక జనసేన కార్యాలయంలోకండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టిడిపి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జనసేన మునగపాక గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శిగా దొడ్డి మహేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, ప్రధాన కార్యదర్శి కె చంద్రమోహన్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఆడారి శ్రీకాంత్, మునగపాక గ్రామసభ అధ్యక్షులు సూరిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

దిశ డిఎస్‌పిగా ఉపేంద్ర

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి దిశ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి ఎం ఉపేంద్ర ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా సిసిఎస్ సీఐగా పనిచేసి, ఉద్యోగోన్నతిపై అనకాపల్లి డిఎస్‌పిగా బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇంతవరకు డిఎస్‌పిగా పనిచేసిన బి మహేశ్వరరావు అమలాపురం డిఎస్‌పిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్త డిఎస్‌పి ఉపేంద్ర మాట్లాడుతూ, మహిళ రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

18న ప్రవేశపరీక్ష

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా సహకారంతో ఫ్యాషన్ అండ్ గార్మెంట్స్ మేకింగ్ కోర్సులో శిక్షణకు అర్హుల ఎంపికకు ఈనెల 18న ప్రశాంతి జూనియర్ కళాశాలలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ లాలం అప్పలనాయుడు తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థినీవిద్యార్థులకు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులన్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ప్రశాంతి జూనియర్ కళాశాలలో డివిఇఒ సుజాత ఆవిష్కరించారు..రెండేళ్ళ కాలవ్యవధి గల కోర్సులో ప్రవేశానికి 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఎంట్రన్స్ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి 50శాతం రాయితీతో ప్రవేశార్హత కల్పించనున్నట్లు వెల్లడించారు. స్వయంఉపాధి, ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్న ఈ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపిపితో భరత్ భేటీ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎంపిపి గొర్లి సూరిబాబును ఆయన స్వగృహంలో అనకాపల్లి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్, వైసిసి యువజన విభాగం జిల్లా నాయకులు మలసాల కుమార్‌రాజా కలిశారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నియోజకవర్గంలో పరిచయ కార్యక్రమంలో భాగంగా ఎంపిపి ఇంటికి వెళ్లి భరత్ కలిశారు.

క్రికెట్ శిక్షణ మైదానం ప్రారంభం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్చుతాపురం పంచాయతీ కోణంపాలెం గ్రామంలో క్రికెట్‌లో క్రీడాకారులకు శిక్షణనిచ్చేందుకు రూ.13 లక్షలతో అడిగర్ల సూర్య నిర్మించిన ప్రాక్టీస్ మైదానాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి ప్రాక్టీస్ గ్రౌండ్‌ను నిర్మించిన సూర్యను అభినందించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యువి. సుకుమార్ వర్మ, కె వెంకునాయుడు, ఎంపిటిసి లాలం శ్రీనివాస్, వైసిపి సీనియర్ నేతలు కోన బుజ్జి, పి వాసురాజు, దేశంశెట్టి శంకరరావు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి తీర్థం

ప్రజాశక్తి- కె.కోటపాడు: మండలంలోని గొండుపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.అన్నసమారాధన నిర్వహించారు. కోలాటాలు, భజనలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.. సాయంత్రం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు కనక మల్లేశ్వరి, ఎంపిటిసి వంటాకు నారాయణమూర్తి , బండారు లక్ష్మణరావు, వంటాకు శ్రీను పాల్గొన్నారు .

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

పలుచోట్ల సన్నాహక సమావేశాలు... విస్తృత ప్రచారం, పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - పరవాడ: డ్రైవర్లకు ఉరి తాడు లాంటి బిఎన్ఎస్ చట్టాన్ని తీసుకొచ్చి, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ దుర్మార్గమైన చర్యలకు వ్యతిరేకంగా ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త బంద్‌లో మోటారు కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆటో కార్మిక సంఘం పరవాడ మండల గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మోటార్ కార్మికులకు నష్టం చేసే చట్టంలోని నిబంధనలు, బిఎంఎస్ చట్టంలోని కఠినమైన షరతులను మార్పు చేయాలని కోరారుఆదివారం అనకాపల్లి జిల్లా ఆటో కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో పరవాడ మండల లంకెలపాలెంలో బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం పరవాడ మండల గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిఎన్ ఎస్ 106 సెక్షన్ ఒకటి, రెండు రద్దు చేయాలని, జిఒ 21ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ డీజిల్ ధరలను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు ఈనెల 16న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో మోటార్ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నర్సింగరావు, రామారావు, అప్పలరాజు పాల్గొన్నారు

పరవాడలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గనిశెట్టి

16న సమ్మెను జయప్రదం చేయాలి

గాజువాక : ఈ నెల 16న జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు శ్రామిక సంఘం నాయకులు బొడ్డు పైడిరాజు కాంట్రాక్ట్ కార్మికులను కోరారు. ఆదివారం అసంఘటిత కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కరణం సత్యారావు, బొడ్డు రమణ, కరణం బాలయోగి, బొడ్డు శివ, రాజేష్ యాదవ్, పంచదార్ల పెంటారావు పాల్గొన్నారు.

ములగాడ : వెంకన్నపాలెం సిఐటియు కార్యాలయంలో సమ్మె పోస్టర్‌ను సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.పెంటారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.పెంటారావు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన చేపట్టే బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 13వ తేదీన సాయంత్రం 4గంటలకు డాక్ యార్డ్ పైపు లైన్ నుంచి జింక్ గేట్ వరకు చేపట్టే బైక్ ర్యాలీలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టల్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిఐటియు నాయుకులు పి.పైడిరాజు, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి జి.నరేష్, జోన్ నాయకులు ప్రేమ్, హరి, రాజు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ములగాడలో వాల్‌పోస్టర్లను ఆవిస్కరిస్తున్న సిఐటియు నేతలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సింధియా జంక్షన్‌లోని శ్రీ కనకదుర్గ ఆటో స్టాండ్ వద్ద బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యఆంజనేయ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వెంకట్రావు, సిపిఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల రాంబాబు, కనకదుర్గ ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ వీరి నాయుడు, సెక్రటరీ జగ్గారావు కమిటీ సభ్యులు యోబు, సంజీవ్ పాల్గొన్నారు.

నక్కపల్లి: ఈ నెల 16న సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా ప్రదాన కార్యదర్శి ఎం.అప్పలరాజు పిలుపునిచ్చారు. మండలంలోని నెల్లిపూడి గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండిస్తున్న పంటలకు పార్లమెంటులో మద్దతు ధరల చట్టం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.హామీ ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టం చేయకుండా దేశ రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు. నలభై నాలుగు కోట్ల మంది రైతాంగం నాలుగు లక్షల కోట్ల రుణాలు మాఫీ చేయమంటే చేయని నరేంద్ర మోడీ ప్రభుత్వం, దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్లకు పంతొమ్మిది లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసి తమ భక్తిని చాటుకున్నారన్నారు.కార్మిక నాయకుల త్యాగాలు, పోరాటాలు ఫలితంగా వచ్చిన నలభై నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేసి పారిశ్రామిక వేత్తలకు లాభం చేకూర్చే విధంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం జరిగిందని,ఈ లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2022 విద్యుత్ సవరణ చట్టం రద్దు చేయాలని కోరారు. కనీస వేతనాలు ఇరవై ఆరు వేలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్, నాయకులు బి.రాము, ఆర్.కనకేశ్వరరావు, ఆర్.దండుబాబు, ఏ.అప్పల రాజు, పి.తాతారావు, ఎం.శ్రీను, కె.బుజ్జి, ఎం.రమణ, బి.శివ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో మాట్లాడుతున్న అప్పలరాజు

అభివృద్ధితో కూడిన సంక్షేమ పాలన

ప్రజాశక్తి- దేవరాపల్లి : సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, బూడి ముత్యాల నాయుడు అన్నారు. ఆదివారం దేవరాపల్లి పంచాయతీలో రూ. 96 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. పెద్దఎత్తున మహిళలు, ప్రజలు, వైసిపి శ్రేణులు పాల్గొని, పండగ వాతావరణంలో కార్యక్రమాలను నిర్వహి ంచారు. ఈ సందర్భంగాబూడి మాట్లా డుతూ, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆధునిక హంగులతో రూ.2.67 కోట్ల నిధులతో రూపుదిద్దుకున్న మండల పరిషత్ కార్యాల యాన్ని ప్రారం భించారు. దేవరాపల్లి పంచాయతీలో రూ. 92 కోట్ల 9 లక్షల 64 వేల 783 లతో వివిధ అభివద్ధి సంక్షేమ పథకాలను సూచించే పైలాన్‌ను మంత్రి బూడి ఆవిష్కరించారు. ప్రమాదవశాత్తు కాళ్లు పోగొట్టుకున్న సబ్బవరపు నాయుడు, ఆబోతు రమణ తమ సమస్యను గడపగడపకు కార్యక్రమంలో బూడి దృష్టికి తేగా, ముఖ్యమంత్రికి విన్నవించి, ఒక్కొక్కరికి మంజూరైన రూ.మూడు లక్షల ఆర్థికసాయం చెక్కులను అందించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, జెడ్‌పిటిసి కర్రి సత్యం, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ, మాడుగుల, కె. కోటపాడు ఎంపిపిలు తాళ్లపరెడ్డి రాజారావు, రెడ్డి జగన్మోహన్, మాజీ ఎంపీపీ వేమవరపు రామ ధర్మజ, జే సి ఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కష్ణమూర్తి, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బూడి ముత్యాలనాయుడు

అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు పునర్నిర్మాణానికి

నేడు భారీ మానవహారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి, అచ్యుతాపురం ప్రధాన రహదారి తక్షణమే పునర్నిర్మించాలని రెండు వారాలుగా చేస్తున్న నిరవధిక ఆందోళనల్లో భాగంగా ఈనెల 12వ సోమవారం ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు నాగులాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు భారీ మానవహారం నిర్మించనున్నట్లు రహదాదరి పునర్నిర్మాణ పోరాట కమిటీ కన్వీనర్ కాండ్రేగుల రామ సదాశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాగులపల్లి నుంచి అచ్చుతాపురం వరకు రోడ్డుకు ఇరువైపులా ఏ గ్రామం ప్రజలు ఆ గ్రామం వద్ద మానవహారంగా ఏర్పడాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డును తక్షణమే పునర్నిర్మించాలని, భారీ వాహనాల నిలుపుదలకు గడ్డలను ఏర్పాటు చేయాలని, భారీ వాహనాలు ఆపి ప్రమాదాలు నివారించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. భారీ మానవహారంపై ప్రభుత్వం స్పందించకుంటే, పరిసర గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు నిరవధిక రోడ్డు దిగ్బంధనం, బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. కాగా రోడ్డు పునర్నిర్మాణానికి చేపడుతున్న ఆందోళనలో భాగంగా గతనెల 30 నుంచి అన్ని గ్రామాల సంతకాల సేకరణ చేపట్టారు. ఈనెల 7న అఖిలపక్ష సంఘాలు పార్టీలు, సంస్థలు, యువకులు ప్రజలతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. ఇపుడు ఊరూరా మానవహారం నిర్మించాలని కోరారు.

మునగపాక: అనకాపల్లి, అచ్యుతాపురం రోడ్డులో భారీ వాహనాలను నిలుపుదల చేసి, రహదారి పునర్నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్‌తో రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు 12న నిర్వహించే మానవహారానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కమిటీసభ్యులు ఎస్ బ్రహ్మాజీ, మొల్లేటి సత్యనారాయణ పిలుపునిచ్చారు.

స్థానిక మెయిన్ రోడ్‌లో ఆటో యూనియన్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. వాహనదారులు, బాట సారులు, ప్రజలు ఆయా గ్రామాల్లో మానవహారంలో పాల్గొని, నిరసన చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బాలరెడ్డి సూరిబాబు, భాస్కరరావు, వేగి శభాష్, వెలగ సూరిబాబు, సత్యనారాయణ, శంకరరావు పాల్గొన్నారు.

రీ సర్వేలో రద్దు చేసిన..

పట్టాలు పునరుద్ధరించాలి

-సిపిఎం ఆధ్వర్యంలో ఆదివాసీల నిరసన

నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

ప్రజాశక్తి -కొత్తకోట:జగనన్న రీ సర్వేలో రద్దు చేసిన పట్టాలు పునరుద్ధించాలని కోరుతూ రావికమతం మండలం టి.అర్జాపురం శివారు రామన్నదొరపాలెం గ్రామ ఆదివాసీ గిరిజనులు సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత గిరిజనులు అప్పిలి గడ్డెమ్మ, ధోని రాజేశ్వరి, చిన్ని నూకాలమ్మ, అప్పిలి నూకరాజు తదితరులు మాట్లాడుతూ, కొట్నాబిల్లి రెవిన్యూ పరిధి సర్వే నెంబర్లలో 120-పి, 129/1, 2,3,5, 6,7,లలో సుమారు 16 ఎకరాల 72 సెంట్లు సీలింగ్ భూములను రామన్న దొరపాలెం గ్రామానికి చెందిన 17 ఆదివాసి గదభ (పివిటిజి) గిరిజన కుటుంబాలకు 1976 సంవత్సరంలో ల్యాండ్ సీలింగ్ భూమికి పట్టాలు పంపిణి చేసారన్నారు. అప్పటి నుండి నేటి వరకు తామే సాగులో ఉండగా వెబ్ ల్యాండ్ రికార్డులో తమకు వన్ బి కాఫీలు కూడా ఇచ్చారని చెప్పారు. జగనన్న రీ సర్వేలో సర్వే అధికారులు తమ పట్టాలకు సంబం దించి జిరాక్స్ కాపీలు ఇవ్వమని కోరగా ఇచ్చామన్నారు. ఆరోఓఆర్ రికార్డు ప్రకారం తమ భూములు 22(ఏ) జాబితాలో ఉన్నాయని, ఓల్డ్ అడంగ జాబితాలో కూడా తమ పేర్లు ఉన్నాయని, ప్రభుత్వం పాస్ బుక్‌లు మంజూరు చేసారని వివరించారు.. జగనన్న రీ సర్వేలో ప్రభుత్వ భూములుగా చూపిస్తున్నారన్నారు. గతంలో తాము బ్యాంకులో రుణాలు తీసుకున్నామని ఆ రుణాలు కూడా బ్యాంకులకు తిరిగి చెల్లించామని తెలిపారు. కొత్తగా రుణాలు ఇవ్వావాలని బ్యాంకులో అడిగితే. వన్ బి, అడంగల్ తీసుకు రమ్మని చెప్పారని, వాటి తీయించడం కోసం మీ సేవా కేంద్రాలకు వెళితే భూమి వివరాలు లేవని బాధిత గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ భూములపై ఆధార పడి ప్రయివేట్ వడ్డీ వ్యాపారస్తుల నుండి అధిక వడ్డీలకు అప్పులు చేసి వరి, అరటి, చెరుకు పంటలకు పెట్టుబడులు పెట్టామని పేర్కొన్నారు.

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఈ క్రాప్ నమోదు చేయక పోవడంతో అన్ని హక్కులు ఉన్నా గిరిజనులు ప్రభుత్వం రాయితీలు పొంద లేదన్నారు. జగనన్న రీ సర్వేలో తీవ్రమైన అన్యాయం చేశారని, తక్షణమే ఆ భూములను డబ్లూన్ ద్వారా రికార్డులలో నమోదు చేయాలని లేదా జిల్లా జాయింట్ కలెక్టర్‌తో విచారణ చేపట్టి రికార్డులు సరి చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో బాధిత గిరిజనులు అప్పిలి రాజులమ్మ, సాయి భవాని, నందిలి చెంచమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలోని అమలాపురం గ్రామంలో ఆదివారం రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు సంబంధించిన అన్ని సేవలు ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుర్ల రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కథల సారాంశాన్ని వివరిస్తున్న దమయంతి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖ గ్రంథాల యంలో చిల్డ్రన్స్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని ఆదివారం గ్రంథాలయాధికారి దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో నీతి కథలు చదివించి వాటిలో నీతిని బోధించారు. అనంతరం ఇంగ్లీష్ గ్రామర్‌ను సచివాలయ ఉద్యోగి భవాని వివరించారు.

పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని రావణా పల్లిలో సీతారాముల ఆలయం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలంతా ఈ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసిన హోమాల్లో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు.

రామాలయ పనులు పున:ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్. నాగాపురం గ్రామంలో రామాలయ పున:నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభ మయ్యాయి. ఇక్కడి పాత ఆలయం ఉన్న చోటే రూ.20లక్షల అంచనా వ్యయంతో నూతన హంగులతో కొత్త రామాలయం పున: నిర్మాణానికి గ్రామస్థులంతా ఏకమై శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు మాట్లాడుతూ, తిరుమల తిరుపతి దేవస్థానం 10లక్షలు మంజూరు చేసిందన్నారు. దాతలు : 9492339941 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలోని బిఎస్.పేటలో ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. రూ.10 లక్షల టీటీడీ నిధులతో నూతనంగా అంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయాన్ని ఆదివారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు రుత్తల వాసు, పిఎసిఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు, నాయకులు భద్రాచలం, చిటికల రమణ, చామంతిపురం సర్పంచ్ బొడ్డు గోవింద, రాచపల్లి మాజీ సర్పంచ్ దొరబాబు, బిఎస్ పేట సర్పంచ్ శివరామకృష్ణ, బాల పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

డైరీని ఆవిష్కరిస్తున్న మేనేజర్, నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:అంబేద్కర్ ఆశయ సాధనకు మీరంతా నడుం బిగించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ధీరజ్ కోరారు. స్థానిక నవనిర్మాణ సమితి కార్యాలయంలో ఆదివారం దళిత హక్కుల పోరాట సమితి డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. డిపో మేనేజర్ ధీరజ్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్, అనకాపల్లి జిల్లా డిహెచ్‌పిఎస్ నాయకులు డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ, అంబేద్కర్ రచించిన అనేక పరిశోధన గ్రంథాలు ఈ ప్రపంచానికి ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. అంబేద్కర్ భావజాలన్నీ ప్రచారం చేసి చైతన్యం నింపాలని కోరారు.

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ మూడోసారి బిజెపి కేంద్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా తొలగిస్తుందన్నారు. అత్యాచార నిరోధక చట్టాన్ని నీరు కార్చే విధంగా చేశారని వాపోయారు. నరేంద్ర మోడీ రాజ్యాంగ స్ఫూర్తిని విధ్వంసం చేస్తూ అనగారిని కులాల పైన దాడులకు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ డిసిహెచ్.రాజబాబు, జిల్లా కార్యదర్శి లోవ, ఉపాధ్యక్షులు కొండ్ర అప్పారావు, పాపారావు, బిఎస్పీ నాయకులు నాగరాజు, టిడిపి నాయకులు నేతలు నాగేశ్వరరావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బందుల సుబ్బలక్ష్మి, పెద్దాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలువను తవ్వి వదిలేశారు...

ఆందోళనలో వాహనదారులు

ప్రజాశక్తి- కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రధాన రహదారి సంతబయలకు వెళ్లే రోడ్డు మిచౌంగ్ తుఫాను వర్షాల కారణంగా ముంపునకు గురైంది. దీంతో, ఆ నీటిని మళ్లించేందుకు ప్రధాన రహదారిని తవ్వేసి వదిలేశారు. అప్పటి నుంచి ఎవరు పట్టించుకోలేదు. డిసెంబర్ నెలలో సంభవించిన తుఫాను కారణంగా తీసిన కాలువ నేటికి కూడా అసంపూర్తిగా కప్పి వేయడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందో ప్రయాణికులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రైతులు పాడి పశువుల రాకపోకల్లో తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

తవ్వి వదిలేసిన కాలువ

అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని మఠం పంచాయతీ గ్రామంలో వచ్చే నెల 7,8,9 తేదీల్లో జరిగే మహా శివరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నిక ఆదివారం మత్స్య గుండం దేవాలయం వద్ద ఏక గ్రీవంగా ఎన్నికైందని ఆలయ కమిటీ పెద్ద మఠం సూర్యనారాయణనాయుడు తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్ పర్సన్‌గా మఠం పంచాయతీ సర్పంచ్ మఠం శాంత కుమారి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు గా మినుముల గోపాల పాత్రుడు, ప్రధాన కార్యదర్శిగా పాంగి మత్స్య కొండబాబు, ఉపాధ్యక్షులుగా వంతల ఈశ్వర్, కోశాదికారిగా తమర్భ భీమ్ బాబు తదితరులు ఎన్నికయ్యారు.

నియామక పత్రాలను అందిస్తున్న కోఆర్డినేటర్

నూతన కార్యవర్గం నియామకం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏజెన్సీ లక్ష్మీపురంలో శ్రీ సత్య సాయి సేవ సమితి, పాతకృష్ణదేవిపేట భజన మండలి సత్య సాయి ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో భజన మండలకి సంబంధించి కన్వీనర్‌గా వెచ్చం శివకుమార్, జాయింట్ కన్వీనర్లుగా వినుకోటి కిరణ్, టెంకా లోవరాజులను అనకాపల్లి జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు కృష్ణంరాజు నియమించారు. ఇందులో భాగంగా వీరు ముగ్గురికి జిల్లా జాయింట్ యూత్ కోఆర్డినేటర్ శివకుమార్, మండల ఇంచార్జ్ పిఎస్ఎన్ మూర్తి, మండల గ్రామ సేవా ఇన్చార్జ్ జివి.రమణ, ఏజెన్సీ లక్ష్మీపురం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దుళ్ళ శ్రీనివాస్ తదితరుల చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.

ఓటు హక్కును ఉపయోగించుకోండి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించు కోవాలని వరల్డ్ హ్యూమన్ రైట్స్ నేషనల్ ఛైర్మన్ రావూరి బాలరాజు కోరారు. మండలంలోని కొర్రాయి పంచాయతీ జామ్‌గుడ గ్రామంలో ఆ పంచాయతీ సర్పంచ్ పి.కొములు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ప్రతిఒక్కరూ మానవ హక్కుల అవగాహన కలిగివుండాలని, ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు ఓటు వినీయోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బురిడీ విక్రందేవ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో హెల్త్ క్యాంపు నిర్వహించాలని ఛైర్మన్‌ను కోరామన్నారు. గిరిజన గ్రామాలలో సమస్యలు హ్యూమన్ రైట్స్ ద్వారా పరిష్కారం చేయాలనీ కోరామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాముగూడ స్కూల్ పదవ తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ సామగ్రి పంపిణీ చేశారు.

మాట్లాడుతున్న అమ్మోరయ్య

మత్స్యకారులకు సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మత్స్యకారులకు గుర్తింపు ఇవ్వని పార్టీలను ఓడిస్తామని మత్స్యకార జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరయ్య అన్నారు. నక్కపల్లిలో మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో సంఘ నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మోరయ్య మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్, రాజ్యసభ, ఎమ్మెల్సీ స్థానాల్లో మత్స్యకారులకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. 12 అసెంబ్లీ, 2 పార్లమెంటు, 1 రాజ్యసభ, 4 ఎమ్మెల్సీ స్థానాలు కేటాయిం చాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో కూడా మత్స్యకారులకు స్థానం కల్పించాలన్నారు. జీవో 117 ను రద్దు చేయాలని, తీర ప్రాంతాల్లో రసాయన పరిశ్రమలు నెలకొల్పద్దని డిమాండ్ చేశారు. మత్స్య జేఏసీ ఉత్తరాంధ్ర ఇన్చార్జి ఉమ్మడి సంజీవరావు, నాయకులు అప్పలరాజు, వెంకటేష్ తదితరులు మాట్లాడారు.

మాట్లాడుతున్న రామానాయుడు

నవరత్నాల పేరుతో మోసం : టిడిపి

ప్రజాశక్తి-చీడికాడ: నవరత్నాల పేరుతో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలను మోసం చేయడమే కాకుండా రాష్ట్ర ఖజానాన్ని పూర్తిగా ఖాళీ చేశారని తెలుగుదేశం పార్టీ నేత, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు విమర్శించారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పాదయాత్ర రెండో రోజు భాగంలో మండలం కేంద్రంలో మాడుగుల ఇన్చార్జ్ పి.వి.జి కుమార్‌తో కలిసి చేపట్టారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద సమావేశంలో మాట్లాడుతూ, దొంగ హామీలతో ముఖ్యమంత్రి పీఠం దక్కించుకొని తర్వాత పంగనామాలు పెట్టారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు నాయుడు మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ బృతి వంటి కార్యక్రమాలు మరిన్ని అమలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతుల చిన్నం నాయుడు, గాలి సామాలమ్మ, బొబ్బాది తాతారావు, దారపు పెద్ది నాయుడు, కొల్లి సూర్య నాయుడు, ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం బాలోత్సవం.. అదుర్స్

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

మాట్లాడుతున్న ప్రభావతి

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : అక్కడ ఆట పాటల్లో పిల్లలు దుమ్మురేపారు. నాటికల ప్రదర్శనలో ఔరా అనిపించారు. శాస్త్ర విజ్ఞాన ప్రదర్శనలతో చైతన్యం రేకెత్తించారు. వెరసి నర్సీపట్నం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వేదికగా సాగిన నర్సీపట్నం బాలోత్సవం అలరించింది. ఈ పిల్లల పండుగ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. చిత్రలేఖనం, వ్యాసరచన, కథారచన, స్పెల్ బీ, క్విజ్, మట్టితో బొమ్మల తయారీ, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. దేశభక్తి గీతాలకు, జానపద గేయాలకు వేసిన నృత్యాలకు వీక్షకుల నుంచి చప్పట్ల వర్షం కురిసింది. ఏకపాత్రాభినయం, కోలాటం, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లోగల వివిధ పాఠశాలల నుంచి వందలాది మంది విద్యార్థుల రాకతో ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. విజేతలకు నర్సీపట్నం బాలోత్సవం గౌరవ అధ్యక్షులు దస్త్రాల రాఘవేంద్రరావు, అధ్యక్షులు డాక్టర్

అధికారి గోపాలరావు, కన్వీనర్ కె.త్రిమూర్తులు రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు, హెచ్ఎం మాధవి బహుమతులు అందజేశారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటువంటి బాలోత్సవాలు పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీస్తాయన్నారు. కలివిడి తత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నృత్యం చేస్తున్న విద్యార్థి

నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆదివాసీలకు తప్పని డోలీ మోతలు

ప్రజాశక్తి అనంతగిరి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిమా జాతి పివిటిజి గిరిజన ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి తప్ప ఆచరణలో అమ్మలు కాలేదు. దీంతో, మారుమూల గిరిజన గ్రామాల్లో కనీసం రోడ్డు సౌకర్యాలు లేక రోగులు, బాలింతలు, గర్భిణీలకు డోలి కష్టాలు తప్ప లేదు. వివరాలు.. అనంతగిరి మండలం మారుమూల పెద్దకోట పంచాయతీ పరిధి ఆదిమ జాతి పివిటిసి మద్రేబు గ్రామానికి చెందిన కొండతాబేలి లింబో అనే గిరిజనుడు గత వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు గ్రామం నుండి దట్టమైన అటవీ ప్రాంతం కొండ కోనల నడుమ సుమారు 10 కిలోమీటర్ల దూరం దుప్పటి డోలి కట్టి తునిసిబు గ్రామం రోడ్డులో చేర్చారు. అక్కడి నుండి ప్రథమ చికిత్స నిమిత్తం పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు రోగికి చికిత్స అందించడంతో ఆరోగ్య పరిస్థితి కుదుటపడింది. అనంతరం ఆసుపత్రి నుండి తునిసిబు గ్రామం వరకు ప్రైవేటు వాహనంలో తరలించి అక్కడ నుండి కుటుంబ సభ్యులు మద్రేబు గ్రామం వరకు డోలి సాయంతో తిరిగి తరలించారు. గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం కల్పించాలని ఈనెల 14వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో ఆందోళన చేపడతామని పివిటిజీ సంఘం జిల్లా అధ్యక్షులు, సిపిఎం కార్యవర్గ సభ్యులు కె.గోవింద్ తెలిపారు.

రోగిని డోలీలో తరలిస్తున్న బంధువులు

కాంగ్రెస్ వార్డు అధ్యక్షులకు నియామక పత్రాలు

ప్రజాశక్తి- గాజువాక : కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులకు గాజువాకలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త జెర్రిపోతుల ముత్యాలు ఆదివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. 64వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా యరబాల భూలోక, 65వ వార్డుకు ఎంఎస్.వర్మ నియమితుల య్యారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా భూలోక, వర్మ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని, దాన్ని గుర్తించి పార్టీ ఈ నియామకాలు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఎస్‌సి సెల్ నాయుకులు ములకలపల్లి రాజుబాబు, కట్టా అప్పారావు, శనివాడ హరిబాబు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందుకుంటున్న భూలోక తదితరులు